క్లుప్తంగా

'పోలమాంబ జాతరలో పిల్లలకు ప్రత్యేక ఏర్పాట్లు'

ఏయూ క్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయ వార్షిక జాతరలో పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. ఈ మేరకు శనివారం ఆలయ ఈవో కె.గాయత్రితో మాట్లాడి ఏర్పాట్లు చేస్తున్న విధానం అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లలో చంటి పిల్లల తల్లులకు పాలు పట్టడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, దివ్యాంగ పిల్లలకు సులభ దర్శనం అందించే ప్రత్యేక లైన్లు, తగినన్ని ట్రై సైకిళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. పిల్లల వైద్య నిపుణులను అందుబాటులో ఉంచాలని, చిన్నారులకు పాలు, బిస్కెట్లు క్యూలైన్లలో అందించే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల విద్యార్థులకు స్టార్టప్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఏయూ ఆహాబ్ సీఈవో రవి ఈశ్వరరావు మాట్లాడుతూ స్టార్టప్‌లతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ప్రముఖ ట్రైనర్ అనంతరామ్ ఘనాపాటి పాల్గొని స్టార్టప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌వీపీలో కొత్త అవుట్ పేషెంట్ విభాగం



అవుట్ పేషెంట్ విభాగం ప్రారంభిస్తున్న లారస్ ల్యాబ్ లిమిటెడ్ సీఈవో సత్యనారాయణ చావా

ఆరిలోవ: హనుమంతవాక జంక్షన్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో కొత్తగా అవుట్ పేషెంట్ విభాగం అందుబాటులోకి వచ్చింది. ఈ విభాగాన్ని శనివారం లారస్ ల్యాబ్ లిమిటెడ్ సీఈవో సత్యనారాయణ చావా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విభాగానికి తమ ల్యాబ్ నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ విభాగంలో 12 పరీక్షా గదులు, 100 మంది విశ్రాంతి తీసుకొనేలా హాల్ ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవా తెలిపారు. ఈ కార్యక్రమంలో లారస్ ల్యాబ్ హెచ్ఆర్ నర్సింహారావు చావా, ఈడీ రవి కుమార్, ఎల్వీపీ వైద్యుడు డాక్టర్ అవినాష్ పతంగి, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆరిలోవ: జాతీయ రహదారిపై పడిపోయి గాయాలపాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారిపై జంతు పునరావాస కేంద్రం(ఏఆర్‌సీ) వద్ద శుక్రవారం మతిస్థిమితం లేని ఓ వ్యక్తి రోడ్డుపై పరుగెడుతూ డివైడర్ దాటుతుండగా పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన ఆయన్ను కొందరు వాహనచోదకులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీనిపై ఆరిలోవ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. అతని వయసు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటాయని భావిస్తున్నారు. అతని బంధువులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంపీ ఎంవీవీకి జనం నీరాజనాలు

- 18వ వార్డులో విస్తృత ప్రచారం
- హారతులు పట్టి స్వాగతించిన మహిళలు



18వ వార్డు అప్పుఘర్‌లో ప్రచారంలో భాగంగా ఎంవీవీకి హారతిపడుతున్న మహిళ

ఎంవీపీ కాలనీ: ఎన్నికల ప్రచారం చేస్తున్న విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకు వాడవాడలా ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. శనివారం 94వ రోజు 18వ వార్డు అప్పుఘర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి ఎంవీవీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అద్భుతమైన సేవలు అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఓటర్లను కోరారు. ప్రజా సంక్షేమం ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు చేసిందేమి లేదని ఆరోపించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు కూడా నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. ఈ విషయాన్ని గమనించి నియోజకవర్గంలో ఈ సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయడానికి ఓటర్లు నడుం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

28వ వార్డులో..

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి మద్దతుగా జీవీఎంసీ 28వ వార్డులో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ప్రచారం చేశారు. ఆమె శనివారం ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సంపంగి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



28వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, దుర్గారావు

కర పత్రాల పంపిణీ

జీవీఎంసీ 28వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ 207 బూత్ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏ దేవినా భారత్, అలివేలు, రాపాక శ్రీనివాసరావు, కోన కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో..



23వ వార్డులో మద్దిలపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ 23వ వార్డులో శనివారం విస్తృత ప్రచారం చేశారు. స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయ, సత్యారెడ్డితో కలిసి ఆయన మద్దిలపాలెం ఆర్టీసీ డిపో, గాయత్రి స్కూల్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జేసీఏ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు, కస్టర్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి.. అండగా ఉంటా..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

- అభివృద్ధి పట్టని వెలగపూడిని సాగనంపండి
- సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : 'నేను నమ్మే దైవం మీద ప్రమాణం చేసి చెప్తున్నా.. ఒక్కసారి అవకాశం ఇవ్వండి, మీకు అండగా ఉంటానని' వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పార్టీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో శనివారం మేము సిద్ధం మా బూత్ సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఎంవీవీ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ఎదురుచూస్తున్నారన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసినా అభివృద్ధిని పట్టించుకోని వెలగపూడిని ఇంటికి సాగనంపాలని ఆయన పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకొని మద్యం వ్యాపారం సాగించిన వెలగపూడి నిజస్వరూపాన్ని గ్రహించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, విశాఖ పార్లమెంటు అభ్యర్థి బొత్స ఝాన్సీ ఝాన్సీని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.నారాయణ, పార్టీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు అల్లంపల్లి రాజబాబు, బోని శివరామ కృష్ణ, మండల అధ్యక్షులు, డైరెక్టర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.



ఇసుక తోటలో సిద్ధం సభలో పాల్గొన్న జనం

పోలమాంబకు కుంకుమార్చనలు



సంజయ్‌గాంధీ కాలనీ పోలమాంబ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో గ్రామదేవత పోలమాంబ అమ్మవారి పంచ రాత్రి జాతర మహోత్సవాలు రెండు రోజులుగా జరుగుతునానయి. ఈ ఉత్సవాలు మంగళవారం వరకు కొనసాగనున్నాయి.

ఇందులో భాగంగా శనివారం ఆలయ నిర్వాహకులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక ప్రాంతాల నుంచి సుమారు 200 మంది మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు చేసిన మహిళలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ స్వాతి, తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తూర్పులో ఒక నామినేషన్



ఆర్వో మయూర్ అశోక్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న ప్రజా ప్రస్థానం పార్టీ అభ్యర్థి ముకుంద్

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో శనివారం ఒక నామినేషన్ దాఖలైంది. ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తోట వెంకటసాయి ముకుంద్ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు అందజేశారు. ఇప్పటి వరకు తూర్పులో దాఖలైన నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరింది.

రైల్వే పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారులు

- 28 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు, వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు, ఆర్పీఫ్ ఇన్‌స్పెక్టర్‌ల ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్ఐలు తమ సిబ్బందితో శనివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన బిజూ మహానందియా, సంతోష్ నాయక్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.1.4 లక్షల విలువైన 28 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖ మీదుగా ఢిల్లీకి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, ఇద్దరు నిందితులతో జీఆర్పీ సీఐ, సిబ్బంది



అభివృద్ధిలో కొత్త ఒరవడి

- రూ.1.30 కోట్లతో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- రూ.1.29 కోట్లతో ఏఎస్ రాజా సర్కిల్ సుందరీకరణ
- రూ.40 లక్షలతో ఎంవీపీ కూడలి-అప్పుఘర్ కూడలి రహదారి నిర్మాణం
- రూ.20 లక్షలతో సెక్టార్-6 పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- రూ.60 లక్షలతో డ్రైనేజీల ఆధునికీకరణ, మౌలిక వసతులు
- రూ.52 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



అభివృద్ధి చేసిన ఏఎస్ రాజా సర్కిల్



నూతనంగా నిర్మించిన అప్పుఘర్, ఎంవీపీ సర్కిల్ రహదారి



ఆధునికీకరించిన ప్రాథమిక పాఠశాల

- రూ.4.31 కోట్లతో 18వ వార్డులో అభివృద్ధి పనులు
- నాడు-నేడు కింద ప్రాథమిక పాఠశాల ఆధునికీకరణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఒరవడిని సృష్టించింది. వార్డు ప్రజలకు అవసరాలకు అనుగుణంగా రోడ్లు, కూడళ్లను ఆధునికీకరించడంతో పాటు సదుపాయాలు కల్పించింది. సెక్టార్-6లో పార్కు ఆధునికీకరణ, పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. ఏఎస్ రాజా కూడలిని ఆధునికీకరించి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. వార్డులోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి బాటలు వేసింది. ఐదేళ్లలో వార్డులో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి.

రూ.1.30 కోట్లతో పాఠశాలలో వసతులు

ఎంవీపీ కాలనీ సెక్టార్-7 ప్రాథమిక పాఠశాల ముఖచిత్రం మారింది. దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఈ స్కూల్ రూపురేఖలు నేడు మారిపోయాయి. నగరంలోని కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా జీవీఎంసీ »సిటీస్« పేరుతో ఈ స్కూల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసింది. ఈ స్కూల్ 150 మంది వరకు విద్యార్థులు ఉండగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 8 మంది వరకు ఉపాధ్యాయులు సేవలు అందిస్తున్నారు. గతంలో శిథిలావస్థలో ఉండి అనేక అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలిచిన ఈ స్కూల్ ప్రస్తుతం కార్పొరేట్ లుక్‌తో కాలనీ వాసులను ఆకట్టుకుంటోంది. ఈ పాఠశాలను రూ.1.30 కోట్లుతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూల్‌లో సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థిని విద్యార్థులకు వేరు వేరుగా అధునాతన టాయిలెట్స్‌ను నిర్మించారు. తరగతి గదుల్లో బెంచీలు, అధ్యాపకులకు ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేపట్టారు.5 నుంచి 6 తరగతి గదులను, ఒక ప్రిన్సిపాల్ రూమ్, స్టాఫ్ రూమ్‌లను ఆధునికీకరించారు. కాంపౌండ్ వాల్‌పై పెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. భవనం చుట్టూ గార్డెన్‌ను తీర్చిదిద్దారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

రూ.1.29 కోట్లతో ఏఎస్ రాజా సర్కిల్

స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా ఎంవీపీ కాలనీలోని ఏఎస్‌రాజా సర్కిల్‌ను రూ.1.29 కోట్లుతో అభివృద్ధి చేశారు. సర్కిల్ చుట్టూ కాబుల్ స్టోన్ ఫ్లోరింగ్ వేశారు. సర్కిల్ మధ్యలోని ఐల్యాండ్‌ను పూర్తి గ్రానెట్ వర్కుతో సుందరంగా తీర్చిదిద్ది, ఫౌంటేన్ నిర్మాణం చేపట్టారు. ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్ పనులు చేపట్టి సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దారు.

మరికొన్ని అభివృద్ధి పనులు

18వ వార్డులో ఎంవీపీ కూడలి నుంచి అప్పుఘర్ కూడలి వరకు రూ.40 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం జరిగింది. వార్డులోని పలు సర్వీసు రోడ్లను ఆధునికీకరించారు. మూడు సచివాలయాల పరిధిలో డ్రైనేజీలు, రోడ్లను అభివృద్ధి చేశారు. రూ.60 లక్షల వ్యయంతో ఆయా పనులు జరిగాయి. దీంతో పాటు రూ.20లక్షల వ్యయంతో సెక్టార్-6లోని పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. 18వ వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా రూ.52 లక్షలతో శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించారు.

పాఠశాలకు మహర్దశ వచ్చింది..



గతంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉండే ఎంవీపీ కాలనీ 18వ వార్డు సెక్టార్-9 ప్రాథమిక పాఠశాల ముఖచిత్రం నాడు-నేడు పథకంతో మారిపోయింది. విద్యార్థుల భవిష్యత్‌కు ఉన్నత మార్గం లభించింది. మెరుగైన వసతులు, బోధన లభిస్తోంది. మా పిల్లలతో పాటు మా అన్నయ్య పిల్లలు సెక్టార్-9 స్కూల్‌లో చదువుకుంటున్నారు. రానున్న రోజుల్లో వారికి మంచి భవిష్యత్ లభిస్తుందనే నమ్మకం ఏర్పడింది. స్కూల్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉంది.

– క్రాంతి, 18వ వార్డు ఫిషర్‌మెన్ కాలనీ

పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాం..



ప్రభుత్వ సహకారంతో 18వ వార్డులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం. దశాబ్దాలుగా శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ కోరికను ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. సచివాలయాల వారీగా డ్రైనేజీ ఆధునికీకరణ పనులు, మౌలిక సదుపాయాలు కల్పించారు. పార్కులను అభివృద్ధి చేశాం. ప్రతి పార్కులోను ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశాం. వార్డులో రోడ్ల నిర్మాణం కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వం చేపట్టింది.

– వాసుపల్లి ఎల్లాజీ,
18వ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

తూర్పు తీరంలో 'పూర్వీ లెహర్'

సింథియా: తూర్పు తీరంలో భారత నావికాదళం పూర్వీ లెహర్‌ను నిర్వహించింది. ఆపరేషన్ కంట్రోల్‌లో భాగంగా తూర్పు నావికాదళ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సముద్ర భద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు, భారత నావికాదళం సన్నద్ధతను అంచనా వేయడమే లక్ష్యంగా విన్యాసాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భారత నావికాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, విమానాలు, ప్రత్యేక దళాలు పాల్గొన్నాయి.



సముద్రంలో కాల్పులు జరుపుతున్న భారత నావికాదళానికి చెందిన నౌక

గైస్‌లో జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు

మురళీనగర్: కంచరపాలెంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్)లో శనివారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫైర్ సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ కోర్సుల విద్యార్థులు పాల్గొని ప్రయోగాలు చేశారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సంగీతంలో ఉచిత శిక్షణ

సీతంపేట: కర్ణాటక సంగీతంలో ఉచితంగా శిక్షణకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాత్ర, వాయిద్య, వేద అభ్యాసంలో శిక్షణ పొందడానికి విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులతో ఈ నెల 28వ తేదీ ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు తాటిచెట్లపాలెం ఇ.కె.సంస్కృతి సదన్‌లో జరగనున్న ఎంపిక కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఆసక్తి గల వారు వివరాల కోసం 93983 14502లో సంప్రదించాలని సూచించారు.

పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

బీచ్ రోడ్డు: రోజూ తీసుకునే ఆహారంలో పోషకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని న్యూట్రిషన్ షీలా కృష్ణస్వామి తెలిపారు. శనివారం బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో ఆరోగ్యం-ఆహారం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజన్లు మారుతున్న వేళ రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి బాదం వంటి డ్రైఫ్రూట్స్, సీజనల్ పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు.

ఆత్మరక్షణలో మహిళలకు ఉచిత శిక్షణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకట్ పోలిశెట్టి

సీతంపేట: పీవీజీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్ పోలిశెట్టి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 5 ఏళ్ల చిన్నారుల నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల మహిళలకు ఉచిత శిక్షణకు హాజరు కావచ్చని చెప్పారు. వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్ వద్ద, గోపాలపట్నం ఉన్నత పాఠశాల, భీమిలి బీచ్ వద్ద వచ్చే నెల 10 నుంచి వారంలో ఒక రోజు తరగతులు జరుగుతాయన్నారు. పి.ఎస్.ఆర్ అకాడమీ ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జి పి.నరసింహరావు మాట్లాడుతూ 1980 నుంచి మార్షల్ ఆర్ట్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. మార్షల్ ఆర్ట్స్ ప్రధాన శిక్షకుడు శివరామకృష్ణ మాట్లాడుతూ ఆరు నెలలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందితే ఆత్మవిశ్వాసం, చైతన్యం, ధైర్యం పెరుగుతాయన్నారు.